# వెళ్ళిన పని

**నా** వొత్తిడి వల్లనే మాధవరావు ఆఫీసులో రెండు రోజులు సెలవు పెట్టి, ఆదివారం కూడా కలసి వచ్చేటట్టుగా శనివారం రాత్రి మెయిలు పట్టుకుని పిల్లను చూసి రావటానికి వెళ్ళాడు.

పెళ్ళి సంబంధాలు ముడివెయ్యటంలో కూడ అనుభవమూ, హస్తవాసీ ఉంటుంది. మా సాంబయ్య చిన్నాన్న నాకు తెలిసినంతలోనే పది పన్నెండు సంబంధాలు చేశాడు. మా వూరి రత్తయ్యగారు కూడా పెళ్ళిళ్ళు ముడెయ్యటంలో పేరు మోసిన చెయ్యే గాని, ఆయన వేసే ముళ్ళన్నీ మారాముళ్ళే. రత్తయ్యగారు పెళ్ళిళ్ళు కుదిర్చే తంతు రాజకీయ కలాపాల బాబులాగా వుంటుంది; పిల్లి ఎలుకల్ని పట్టే పద్ధతులూ, బోయవాడు ఉచ్చులువేసి పిట్టల్ని పట్టే పద్ధతులూ ఆయన సంబంధాలు కుదర్చటంలో ప్రవేశపెడతాడు. ఏ పక్షం గురించీ రెండో పక్షానికి పూర్తిగా నిజం చెప్పడు. కొన్ని విషయాలు కప్పిపెడతాడు; కొన్ని విషయాలు సృష్టిస్తాడు; కొన్ని సంగతులు ఉన్నవి ఉన్నట్టుగా చెబుతూ కూడా అవతలివాళ్ళు వాటిని మరో విధంగా అర్థం చేసుకునేటట్టు యుక్తిగా చెబుతాడు. ఇందులోనే రత్తయ్యకున్న నిజమైన ఆనందం... ఆయన దృష్టిలో కాబోయే భార్యా, భర్తా, వాళ్ళ కష్టసుఖాలూ, ఉభయ కుటుంబాలమధ్యా కలకాలం ఉండవలసిన అన్యోన్యమూ - వీటికి వేటికీ చిల్లిగవ్వ విలువ ఉండదు; తానే ప్రధాన వ్యక్తి. చక్రం తిప్పేవాడు, చదరంగం ఆడే ఆటగాడు, సృష్టికర్త...! ఎవరినన్నా అడగండి - రత్తయ్య హస్తవాసి మంచిది కాదంటారు, ఆయన సంబంధం కుదిర్చాడంటే లగ్నానికి ముందు గాని, తరువాత గాని, పెళ్ళి అయిపోయే లోపలగాని, ఆ తరువాత గాని, ఏదో రంధి సాగిందన్న మాటే! ఆయన పద్ధతులు అటువంటివి, హస్తాన్ని అని ఏం లాభం?

ఇంతకూ నేను చెప్పదలచుకున్నది రత్తయ్య గురించి కాదు - రాజీని గురించి. రాజీ మా పెత్తల్లి మనవరాలు - కూతురి కూతురు. తల్లి చిన్నప్పుడే పోయింది. తండ్రి మళ్ళా పెళ్ళి చేసుకొన్నాడు. రాజీ అమ్మమ్మగారింటనే పెరుగుతూ వచ్చింది. ఇప్పుడు మా పెత్తల్లీ వాళ్ళది పెద్ద కుటుంబమే. ముసలాయనా, ఇద్దరు కొడుకులూ, మా పెత్తల్లీ, ఆవిడ కోడళ్ళూ, వాళ్ళ పిల్లలూ, మధ్యని రాజీ. రాజీ ఎంత సమర్థురాలంటే ఇంతమందినీ ఒక

పద్ధతిలో నడుపుకుంటూ వస్తున్నది. చీమ తలకాయంత ఛిద్రం కలిగిందంటే దాన్ని అక్కడికక్కడే తుంచి పారేస్తుంది. స్వార్థంలేని మాటలో సాధారణంగా అందరికీ గురి ఉంటుంది. రాజీ స్వార్థం ఆలోచించదు; దానికి అటువంటి అలవాటే ఉన్నట్టు లేదు.

రాజీకి పెండ్లి కావాలి. దానికి పద్ధెనిమిదో ఏడు నడుస్తున్నది. స్కూలు ఫైనలు తరువాత చదువు చాలునన్నది. ఇంటి పనులు చెయ్యటంలోనూ, ఇల్లు చక్కబెట్టడంలోనూ దక్షతగల కారణంచేతనో ఏమో దానికి ఉద్యోగం చేసుకునే ఆలోచనే లేదు. ఆడవాళ్లు అవకాశం ఉంటే తప్పకుండా ఆర్థికంగా తమ కాళ్ళమీద నిలబడాలని ఒప్పుకుంటుంది గాని, అందుకై అది ఏ ప్రయత్నమూ చెయ్యలేదు.

దాదాపు ఏడాదిగా రాజీకి సంబంధాలు వెతుకుతున్నారు. తాతా, మేనమామలూ అదే పనిమీద ఉండటంచేత ఈ భారం కొంత నాపైన కూడా పడుతుందని నేను ఊహించలేదు. కాని ఒకనాడు వాళ్ళ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. మంచి కుర్రాడు ఎవరన్నా ఉంటే చూడమని.

ఈ ఉత్తరం వచ్చిన క్షణం నుంచీ నేను ప్రతి కుర్రాడికేసి సంబంధాలు చేసే కళ్ళతో చూస్తూ వచ్చాను. అదేం ప్రారబ్ధమో! నా కంటికి మంచి కుర్రాళ్ళల్లే కనిపించిన వాళ్ళందరికీ అదివరకే పెళ్ళిళ్ళు అయిపోయినై. "చూడవోయ్, నీకు పెళ్లి అయిందా?" అని ఇద్దరిని అడిగినాక నాకే సిగ్గెయ్యసాగింది. నా జన్మంతా యువకుణ్ని పట్టుకొని "నీకు పెళ్ళి అయిందా?" అని అడగటానికే అంకిత మయినట్టు అనిపించింది. అందరికీ అట్లాగే అనిపిస్తుందేమోననే భయం కూడ పట్టుకుంది.

కొంచెం ఆలోచించిన మీదట చిలకలాగా అదే ప్రశ్న అందరినీ అడగక్కర్లేదనీ, అవతలివాడికి పెళ్ళి అయింది లేనిదీ తెలియబట్టుకోవడానికి ఇంకా చాలా మార్గాలున్నవనీ తెలుసుకున్నాను. "మీ అత్తవారేవూరు?"... "నీ పెళ్ళికి కట్నం తీసుకున్నావా?"... "మీ ఆవిడ కాలేజీ చదువు చదివిందా?" ఈ విధంగా ఎన్ని ప్రశ్నలైనా వెయ్యవచ్చు.

సంబంధాలు చూడటంలో మెళుకువలు కనిపెడుతున్న కొద్దీ నాకు సంతోషం హెచ్చింది. నన్ను నేను అభినందించుకోసాగాను. అప్పట్లో నేను గ్రహించలేదు గాని, నేనూ ఒక పిల్ల రత్తయ్యగా తయారు కాసాగాను! నేను మరి కొంచెం పెద్ద రత్తయ్యగా పరిణమించే లోపునే మాధవరావు నా కళ్ళ పడ్డాడు.

మాధవరావుకు కొత్తగా మా ఆఫీసులో ఉద్యోగం దొరికింది. పాతిక లోపువాడు అందచందాల సంగతి నాకైతే తెలియదు గాని, మనిషి నేవళంగా, నాజూకుగా ఉంటాడు. నెత్తిమీద జుత్తు నుంచి కాలి బూట్ల పాలిష్ వరకూ మనిషి నిర్దుష్టంగానూ, స్టయిలిష్‌గాను ఉంటాడు. అతని మెదడుకు కావలసిన మేత యావత్తూ "టైమ్", "లైఫ్", "రీడర్స్ డైజెస్ట్"

వగైరా అమెరికను పత్రికల నుంచి వస్తుంది. మా ఆఫీసువాళ్ళు రెండువందలిస్తారు.

నేను అలవరుచుకున్న రత్తయ్యత్వమంతా మరిచిపోయి మాధవరావుతో మొదటిసారి మాట్లాడేటప్పుడే, "చూడవోయ్, నీకు పెళ్ళి అయిందా?" అని అడిగేశాను.

"లేదండీ" అన్నాడతను.

ఆ క్షణమే నాలో వేటతమకం తల ఎత్తింది. ఎట్లాగైనా ఈ పిట్టను కొట్టాలి. మా వాళ్ళు వలలు వేసి గాలించినా రాజీకి ఇంతకంటె మంచి మొగుణ్ణి తీసుకురాలేరు. అయినా నేను తొందరపడక అతన్ని అన్ని రకాల శోధించి చూశాను. చూచిన కొద్దీ అతను నాకు మరింత నచ్చాడు రాజీకి కాబోయే మెగుడుగా.

అన్నిటికంటె ముఖ్యమైన విషయమేమిటంటే మాధవరావు మేక. ఆలోచనల్లోను, మాటల్లోను అమిత సాధువు. ఎవరైనా సరే ఒక విషయం దబాయించి చెబితే తత్కాలికానికైనా నిజమేనని నమ్ముతాడు. వాదించడు. పోట్లాడడు, రాజీ కాస్త గడుసరి, దృఢ స్వభావం గలది. మొగుడూ అటువంటివాడే అయితే ఇద్దరికీ పొత్తు కుదరక పోవచ్చు.

మరో విషయమేమంటే, నేను గమనించినంతవరకు అతనిలో దురలవాట్లూ వ్యసనాలూ లేవు. ఏమైనా తిన్నప్పుడు మంచి రకపు సిగరెట్టు ఒకటి కాలుస్తాడు. ఒక పాకెట్ కొంటే అతనికే అయితే రెండు రోజులు వస్తుందిట.

మాధవరావులో ఏ లోపాలూ లేవని నేను చెప్పటం లేదు. ఉన్న వాటిని నేను సంస్కరించేశాను. అతను పిచ్చివాడల్లే తన పెళ్ళి సమస్య తన తండ్రికీ, అన్నకూ వదిలేసి ఆ సంగతే ఆలోచించటం మానేశాడు. అది చాలా తప్పనీ, ఈ కాలపు కుర్రాళ్ళు జమీందారి యుగం వాళ్ళలాగా కేవలం వంశ మర్యాద నిలబెట్టే పెళ్ళిళ్ళు చేసుకోరాదనీ, అన్ని విధాలా తమకు స్వయాన నచ్చిన పిల్లల్నే పెళ్ళాడాలనీ బోధించాను. నా మాటల ఘాటు అతన్ని నమ్మించినట్టున్నది. "మీరన్నది నిజమేనండీ" అన్నాడతను.

ఇంకొకటేమిటంటే, అతని తండ్రీ అన్నా అతని పెళ్ళికి వీలయినంత కట్నం రాబట్టాలని చూస్తున్నారట. అది ఎంత మాత్రం కూడదన్నాను. అరవై డెబ్భై ఏళ్ల కిందటే గిరీశం కన్యాశుల్కం గురించి, "సెల్లింగ్ గర్ల్స్, డామిట్!" అన్నాడు, నేనీమాట మాధవరావుకు చెప్పాను. (అతను కన్యాశుల్కం చదవలేదు.)

"ఈ కాలపు కుర్రాళ్ళు కట్నాలకు అమ్ముడుపోవటం కంటే మంచి రైలు చూసి దానికింద పడుకోవటం పరువైన పని!" అన్నాను.

"నిజమేనండీ!" అన్నాడు మాధవరావు. ఇంత స్వల్ప విషయం కూడా తనకు అదివరకే తట్టనందుకు ఆశ్చర్యపడుతూ.

ఆ విధంగా నేను మాధవరావును మలిచి తయారుచేసి, "చూడు, మాధవ రావ్!

మా పెత్తల్లి మనవరాలు రాజ్యలక్ష్మి అని వున్నది. మహా చురుకైన పిల్ల. నీలాగే కుదురుగాను, నాజూగ్గాను ఉంటుంది. స్కూలు ఫైనలు చదివింది. బుద్ధిమంతురాలు, ఇంటి పన్లన్నీ చేస్తుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు నువు వెళ్లి చూచుకోవచ్చు. ఈ కాలపు కుర్రాళ్ళకు, అంగడిలో అన్నీ వుండి అల్లుడి నోట శని అన్న తీరుగా, తగిన పెళ్ళాలు దొరకటం రాను రాను కష్టమైపోతున్నది. నీకు మా రాజ్యలక్ష్మి తగిన భార్య అవుతుందని నాకు పూర్తిగా నమ్మకం కుదరటంచేతనే ఈ మాట చెప్పాననుకో, నిజానికి దాని పెళ్ళి సంగతి చూసేటందుకు దాని తాతా ఉన్నాడు, తండ్రీ ఉన్నాడు, ఇద్దరు మేనమామలున్నారు. ఈ విషయం నాదాకా రావలసిన పనేలేదు" అని నూరిపోశాను. నాకు మావాళ్ళు పంపిన రాజీ ఫోటో కూడ తరువాత చూపించాను. ఆ ఫోటోను చూస్తూనే మాధవరావు "చెప్పారు కాదేమండీ" అన్నాడు.

"ఏమిటి?" అన్నాను సంకోచంతో, అతను మా రాజీని అదివరకే చూశాడని కూడ అనుకున్నాను.

"ఈ పిల్లది అచ్చు అవా గార్డినర్ మొహం" అన్నాడతను.

"ఆవిడెవరు?"

"హాలీవుడ్ ఫిలిం స్టార్లెండి."

ఆ ఫిలిం స్టార్ పేరు మళ్ళీ అడిగి తెలుసుకొని మననం చేసుకున్నాను. ఎవరు చూశారు? మాపిల్ల అవా గార్డినర్ లాగా వుంటుందంటే పట్నం కుర్రాళ్లలో ఎంతో మంది ఎగిరి గంతేసి చేసుకుంటా మనవచ్చు!

మొత్తం మీద నా చాకచక్యం కంటే హాలివుడ్‌కే ఎక్కువ విజయం లభించిందనుకుంటాను. మాధవరావు నా దగ్గర రాజీ ఫోటో తీసుకొని తన అన్నకు పంపిస్తూ ఉత్తరం రాశాడు. వారు వెళ్ళి పిల్లను చూడమన్నట్టున్నారు. నాచేత రాజీ వాళ్ళకు ఒక ఉత్తరం రాయించి, వాళ్ళ ఎడ్రసు తీసుకుని మాధవరావు ప్రయాణమై వెళ్ళాడు.

అతని రాక కోసం ఆత్రంగా ఎదురు చూశాను.

మాధవరావు తిరిగి రాగానే నాకు కనిపించలేదు. మర్నాడు ఆఫీసులోనే మేం కలుసుకున్నాం. అతను సాధ్యమైనంతవరకు నన్నూ, నా మొహాన్నీ తప్పించటం చూసి వెళ్ళిన పని సానుకూలం కాలేదని అప్పుడే అనుమానించాను.

నా అనుమానం ఆ సాయంకాలమే రుజువయింది. అతనికి రాజీ నచ్చలేదు. నచ్చకపోవటానికి ప్రత్యేకంగా కారణం ఏమీ లేకపోయినా నేను ఆశ్చర్యపడి ఉండను. లోకోభిన్నరుచి. కాని మాధవరావు చెప్పిన కారణం తెలుసుకొని నేను నిర్ఘాంతపోయాను.

"ఆ అమ్మాయి కమ్యూనిస్టులాగుంది" అన్నాడతను.

"కమ్యూనిస్టా?" అన్నాను. నా చెవులను నేనే నమ్మలేక. రాజీ చిన్నన్న అభ్యుదయ రచయితనని చెప్పుకు తిరగటం నాకు తెలుసు. అతను ప్రజా సాహిత్యం గురించీ, ప్రజల కళలను గురించీ, వ్యాపార కళలు ప్రజలకు చేస్తున్న హాని గురించీ, ఏమేమిటో చెప్పేవాడు.

కాని రాజీ? రాజీ కమ్యూనిస్టేమిటి? ఆ పిల్లకు రాజకీయాలేమిటి?

"ఈ సంగతి తానే చెప్పిందా, ఏమిటి?" అని అడిగాను.

"నేను కమ్యూనిస్టునని ఎవరన్నా చెప్పుకుంటారా?" అన్నాడతను, దానికి తిరుగు లేదన్నట్టుగా. ఈ విషయం అతను పొరబాటు పడ్డాడని నేను రూఢిగా చెప్పగలను. తాము కమ్యూనిస్టు లైనందుకు గర్వపడే వాళ్ళను నేనే అనేకమందిని చూశాను.

"మరి ఈ రహస్యం ఏ విధంగా బయట పడింది?"

అతను చెప్పుకొచ్చాడు. మాధవరావు ఉదయం మావాళ్ళింటికి వెళ్లేసరికి రాజీ, దాని అన్నలూ పత్రికల్లో వార్తలు చర్చిస్తున్నారట.

"రాను రాను అమెరికా సంగతి ఇంత అవమానకరంగా ఉంటున్న దేమిటి?" అని రాజీ అంటుండగా మనవాడు వెళ్ళాడు.

అతన్ని చూస్తూనే పెళ్ళి చూపులకు వచ్చాడని గ్రహించారు. మామూలు మాటా మంతీ అయాక మాధవరావు పని పెట్టుకుని రాజీతో రాజకీయాలు మాట్లాడాట్ట. నా ఉద్దేశ్యం అప్పటికే అతను రాజీని పెండ్లాడరాదని నిశ్చయించుకున్నాడని. అదే నిజమైతే రాజీ అతని అభిప్రాయం మార్చటానికి తగినట్టు మాట్లాడలేదు. అది అన్ని దేశాలకు స్వాతంత్ర్యం కావాలన్నదట. యుద్ధ ప్రయత్నాలను చేసేవాళ్ళను తిట్టిందట. పేదవాళ్లుండరాదట. అమెరికాలో కొద్ది మందే ఉద్యోగాలిచ్చే వాళ్లూ, ఎక్కువమంది వాళ్ల నుంచి ఉద్యోగాలూ, పనీ పొందేవాళ్ళూ ఉన్నారు గనక అక్కడ సామాన్య ప్రజలు స్వతంత్రులనటానికి వీలులేదన్నదట.

"ఇవన్నీ కమ్యూనిస్టులు అనే మాటలేగదా?" అన్నాడు మాధవరావు.

"నెహ్రూ కూడా ఇటువంటి మాటలన్నీ అంటున్నాడే! పెట్టుబడిదారీని నమ్ముకుంటే మన దేశానికి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండదని కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నదే" అన్నాను.

"నెహ్రూ పదవికి ఎన్నికైనవాడు. రేపు ఎన్నికల్లో ఓడిపోతే నెహ్రూ స్థానంలో మరొకడు రావచ్చు. నెహ్రూ రాజకీయాలు నన్నడిగితే తప్పుదోవనే ఉన్నాయ్. మనం అమెరికా పక్షం ఎందుకు కాకూడదు? రష్యా మనని తలగొట్టి మొలేస్తుందా? ఏమైనా ప్రమాదం మీ రాజ్యలక్ష్మి వంటి వాళ్ళనుంచి వస్తుంది. వాళ్ళలో వుండే కమ్యూనిజంతో ఎప్పటికైనా అపాయమే. వాళ్ల ప్రభావం శాశ్వతమైనది. పదవి పోయాక రాజకీయవేత్తలు ఏమి అన్నప్పటికీ వినే వాళ్లుండరు."

మాధవరావుకు కావలసిన రాజకీయ వ్యవస్థ అతనికి భవిష్యత్తులో కనిపిస్తున్నట్టు నా కర్థమయింది.

"ఇవాళ ఉన్న రాజకీయ వాతావరణం ప్రజలకు నచ్చకపోతేనే గద ప్రజలు దాన్ని మార్చేది?" అన్నాను.

"దేశం మనం అనుకున్నంత అన్యాయంగా లేదు లెండి. స్వాతంత్ర్యాన్ని కాపాడే శక్తులు ఈనాడు కూడా దేశంలో ఉన్నాయ్. మా రూమ్‌మేట్ సత్యనారాయణను సి.ఐ.డీలు వెంబడిస్తున్నారు. అతను కమ్యూనిస్టు కాదని నాకు తెలుసు. కాని సోవియట్ పత్రికలూ అవీ కొంటాడు. ఈనాడు అతన్ని ఎవరూ ఏమీ చెయ్యరు. కాని ఎవరు చూశారు? రేపు ఈ ప్రభుత్వం మారితే సత్యనారాయణ వంటి వాళ్లమీద చర్య తీసుకునే అవసరం కలగవచ్చు. అందుకు ఇప్పటి నుంచే తగిన బందోబస్తు చేసుకొని ఉండటంలో తప్పులేదు. సత్యనారాయణ నా దగ్గర పెద్ద లెక్చరిచ్చాడు. "ఇది నెహ్రూ ప్రభుత్వమేనా?" అని అడిగాడు. దేశంలో స్వేచ్ఛ లేదన్నాడు. కాని నేనతనితో ఏకీభవించను. ఇవాళ మన దేశం రష్యాతో సఖ్యంగా ఉండటానికి వెయ్యి కారణాలుండవచ్చు. ఆ సఖ్యం పాలకుల మధ్య ఉన్నంతవరకే అయితే ఫరవాలేదు. ప్రతి అమ్మాయీ జగ్గాయీ తాను రష్యాకు మేనత్త కొడుకునే అనుకోవటం దేశం భవిష్యత్తుకు మంచిదికాదు. ఈ దేశం స్వతంత్రంగా వుండాలంటే..."

మాధవరావు చాలాసేపు ఉపన్యసించాడు. నేను శ్రద్ధగా ఆలకించాను. ఈ రకం రాజకీయాలు నేను ప్రత్యక్షంగా, ఎవరి నోటా విని వుండలేదు. "స్వాతంత్ర్యం" అనే మాటను అతను వుపయోగించే పద్ధతే నాకు ఎంతో ముచ్చట వేసింది. అతనిలో ఇంత లోతులున్నట్టు నేను కలలో కూడా అనుకోలేదు.

ఆ మాటకు వస్తే రాజీని గురించి కూడా నాకు కొత్త అభిప్రాయం కలిగింది. మనుషుల్ని గురించి ఎంత తెలుసుకున్నా ఇంకా తెలుసుకోవలిసింది ఉంటుంది గద!

ఇంతకూ రాజీకి పెళ్ళి చేశాంలెండి. మాధవరావు రూమ్‌మేట్ సత్యనారాయణను కలుసుకున్నాను. అతనికి పెళ్ళి కాలేదని తెలిసింది. రాజీనీ వాళ్ళ చిన్నన్ననూ ఒకసారి రమ్మన్నాను. వచ్చారు. ఒక పూట సత్యనారాయణ మా యింటికి భోజనానికి వచ్చాడు. అయిదు నిమిషాల్లో రాజీకి అతనికి స్నేహం కుదిరినట్టయింది. పెళ్ళి అతి సహజంగానే బహు తక్కువ ఖర్చుతో, పొదుపూ పొచ్చెమూ లేకుండా జరిగిపోయింది. పట్నంలోనే ఇద్దరూ సుఖంగా కాపరం చేస్తున్నారు.

***ముద్రణ : సవ్యసాచి పక్షపత్రిక, 28 డిసెంబర్ 1960***